ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

కళ్లకుర్చి కల్తీసారా ఘటన....

60కి పెరిగిన మృతుల సంఖ్య

- మెథనాల్ సరఫరా చేసిన వ్యక్తి అరెస్టు
- ప్రాణాపాయ స్థితిలో 20 మంది

చెన్నై, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి కరుణాపురంలో కల్తీసారాకు బలైనవారి సంఖ్య ఆదివారానికి 60కి చేరింది. కరుణాపురంలో సారాలో కలిపేందుకు మెథనాల్‌ను సరఫరా చేసిన చెన్నైకి చెందిన ప్రధాన నిందితుడిని సీబీసీఐడీ ఆదివారం ఉదయం అరెస్టు చేసింది. అదే సమయంలో ప్రభుత్వం ప్రకటించిన పది లక్షల ఆర్థిక సాయం కోసం కల్తీసారా తాగి మృతిచెందిన ఒకరి మృతదేహాన్ని వెలికి తీసేందుకు కలెక్టర్ చర్యలు చేపడుతున్నారు. కరుణాపురంలో ప్లాస్టిక్ ప్యాకెట్లలో విక్రయించిన కల్తీసారా తాగి సురేష్, ప్రవీణ్ అనే వారు ఈ నెల 19న ప్రాణాలు కోల్పోయారు. వారి అంత్యక్రియలకు వెళ్ళిన సుమారు 200 మంది అక్కడికి సమీపంలో విక్రయిస్తున్న కల్తీసారా తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని కళ్లకుర్చి, సేలం, విల్లుపురం ప్రభుత్వ ఆసుపత్రులకు, పుదుచ్చేరి జిప్‌మర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స ఫలించక 50 మంది దాకా ప్రాణాలు కోల్పోయారు. శనివారం రాత్రి వరకూ మృతుల సంఖ్య 57కు చేరింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆసుపత్రిలో మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. దీనితో కల్తీసారా దుర్ఘటనలో మృతుల సంఖ్య 60కి చేరింది. కల్తీసారా తాగి కళ్లకురిచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అయి పారిపోయిన సుబ్రమణి అనే వ్యక్తి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. అతడిని స్థానికులు మళ్ళీ ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఇక సేలం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన మాధవచ్చేరికి చెందిన మదన్ మృతి చెందాడు. ఇదే విధంగా కందసామి అనే మరో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయాడు. అధికారుల సమాచారం మేరకు ప్రస్తుతం కళ్లకురిచ్చి ఆసుపత్రిలో 108 మంది, సేలం ఆసుపత్రిలో 30 మంది, విల్లుపురం ఆసుపత్రిలో నలుగురు, పుదుచ్చేరి జిప్‌మర్ ఆసుపత్రిలో 17 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇరవై మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని వైద్యులు తెలిపారు.

సీబీసీఐడీ విచారణ ముమ్మరం...

కల్తీసారా సంఘటనపై సీబీసీఐడీ విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో 60మంది మృతికి సారాలో మత్తుకోసం మెథనాల్‌ను మోతాదుకు మించి కలపడమే కారణమని గుర్తించారు. దీంతో కళ్లకుర్చి సారా వ్యాపారులకు మెథనాల్ సరఫరా చేసిన వ్యక్తుల ఆచూకీ కోసం సీబీసీఐడీ ముమ్మరంగా గాలించింది. ఇప్పటికే ఈ కేసులో 10 మంది వరకు అరెస్టయ్యారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో ప్రధాన నిందితుడైన మధురవాయల్ ప్రాంతానికి చెందిన శివకుమార్ ఆచూకీకోసం గాలించారు. ఈ కేసులో అరెస్టయిన మాదేష్ అందించిన సమాచారం మేరకు శివకుమార్ మెథనాల్ సరఫరా చేశాడని తెలుసుకున్నారు. అతడి ఆచూకీ కోసం సీబీసీఐడీ పోలీసులు చెన్నై నగరమంతటా గాలించారు. చివరకు ఎంజీఆర్ నగర్ చూళైపల్లం ప్రాంతంలో సోదరి ఇంటిలో దాగిన శివకుమార్‌ను ఆదివారం ఉదయం అరెస్టు చేశారు. ఎక్సైజ్ డీఎస్పీ కందసామి, సీఐ అన్నరసి, ఎస్ఐ రాజ్‌కుమార్‌తో ఏర్పాటైన ప్రత్యేక పోలీసుల బృందం ఆ ఇంటిని చుట్టుముట్టి అరెస్టు చేశారు.

ఎవరీ శివకుమార్?

పుళల్ వడపెరుంబాక్కంలోని ఓ రసాయనాల కర్మాగారంలో పనిచేస్తున్న శివకుమార్ కళ్లకుర్చి సారా వ్యాపారులతో సంబంధాలు పెట్టుకున్నాడు. తను పనిచేస్తున్న కర్మాగారంలో టర్పెన్‌టైన్, మెథనాల్ వారికి తరచూ సరఫరా చేసి లక్షలాది రూపాయలు సంపాదించాడు. శివకుమార్ కళ్ళకురిచ్చి జిల్లాతో పాటు మరికొన్ని జిల్లాల్లో సారా వ్యాపారులకు మెథనాల్ భారీగా సరఫరా చేశాడని కూడా సీబీసీఐడీ గుర్తించింది. ఈ నేపథ్యంలో శివకుమార్ పనిచేసిన కర్మాగారాన్ని తనిఖీ చేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా పన్రుట్టికి చెందిన చిప్స్ వ్యాపారి శక్తివేల్‌ను కూడా సీబీసీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. శక్తివేల్ కూడా సారా వ్యాపారులకు మెథనాల్ సరఫరా చేశాడని పోలీసులు తెలిపారు.

నేడు ఓ మృతదేహం వెలికితీత...

ఇదిలా ఉండగా కల్తీసారా తాగి మృతి చెందిన జయమురుగన్ మృతదేహాన్ని వెలికి తీడయానికి జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కల్తీసారా మృతులకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన రూ.10లక్షల కోసం అతడి బంధువులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కారణంగానే అతడి శవాన్ని వెలికి తీయనున్నారు. మాదవచ్చేరి గ్రామానికి చెందిన జయమురుగన్ (45) అదే ప్రాంతానికి చెందిన ఇళయరాజా (35) కలిసి ఈ నెల 18న కరుణాపురం వెళ్ళి కల్తీసారా తాగి మృతి చెందారు. ఇళయరాజా మృతదేహాన్ని కుటుంబీకులు దహనం చేశారు. జయమురుగన్ మృతదేహాన్ని ఖననం చేశారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబీకులు ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షల సాయం పొందటానికి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. దీంతో ఖననం చేసిన జయమురుగన్ దేహాన్ని వెలికి తీయడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ముండియంబాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన వైద్యబృందం సోమవారం ఉదయం మాదవచ్చేరి శ్మశానవాటిలో ఖననం చేసిన జయమురుగన్ మృతదేహాన్ని రెవెన్యూ అధికారులు, పోలీసుల సమక్షంలో వెలికి తీయనున్నారు.


మెథనాల్ సరఫరా చేసిన శివకుమార్


చిప్స్ వ్యాపారి శక్తివేల్

కళ్లకుర్చికి సీఎం స్టాలిన్ ఎందుకు వెళ్లలేదు...?

● మాజీ మంత్రి జయకుమార్

ప్యారీస్, జూన్ 23: కల్తీ సారా తాగి మరణించిన 60 మంది కుటుంబాలను, బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎందుకు వెళ్లలేదని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ ప్రశ్నించారు. ఉత్తర చెన్నై అన్నాడీఎంకే ఆధ్వర్యంలో 48వ వార్డు పార్టీ కార్యదర్శి ఆర్ముగం నిర్వహణలో ప్రజలకు ప్రతిరోజు టీ, కాఫీ పంపిణీ కార్యక్రమాన్ని జయకుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రజల దగ్గర నుంచి టిక్కెట్టుకు రూ.200 తీసుకుంటూ సంపాదిస్తున్న సినీ నటులు కళ్లకుర్చి దుర్ఘటనపై ఇప్పటివరకు పెదవి విప్పకపోవడం దురదృష్టకరమన్నారు. తాను సోషల్ మీడియాలో ఈ అంశంపై ట్వీట్ చేసిన అనంతరం ఇప్పుడిప్పుడే ఒక్కొక్కరు స్పందిస్తున్నారని తెలిపారు. సినీ దర్శకుడు అమీర్ కూడా ఇప్పటివరకు కళ్లకుర్చి బాధితులపై స్పందించలేదని, ఆయన ఎక్కడికెళ్లారో తెలియలేదన్నారు. అదే విధంగా డీఎంకే రాసిచ్చే సంభాషణలపై మాట్లాడే సీనియర్ నటుడు ప్రకాష్‌రాజ్‌తో పాటు మరి కొంతమంది నటీనటులు, రాజకీయ పరిశీలకులు కూడా డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఖండించలేదన్నారు. ప్రస్తుతం తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, నటుడు విజయ్ మాత్రమే కళ్లకుర్చి ప్రాంతానికి వెళ్లి బాధితులను పరామర్శించడంతో పాటు మృతుల కుటుంబాలను కూడా ఓదార్చారని, ఒక్క విజయ్ మాత్రమే కాకుండా ఎవ్వరు ఈ పనిచేసినా అభినందిస్తామన్నారు.

'నీట్' పీజీ పరీక్ష రద్దుతో

సన్నగిల్లిన వైద్యుల నమ్మకం

● సీఎం స్టాలిన్


క్యాంపు కార్యాలయంలో సీఎం స్టాలిన్‌ను కలిసి సత్కరిస్తున్న కేంద్ర మాజీమంత్రి పి.చిదంబరం

ప్యారీస్, జూన్ 23: 'నీట్' యూజీ పేపర్ లీక్ వివాదం దేశవ్యాప్తంగా తీవ్రరూపం దాల్చడం, ఆదివారం జరగాల్సిన నీట్ పీజీ పరీక్షలు రద్దుకావడంతో వైద్యుల్లో నమ్మకం సన్నగిల్లిందంటూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు. మే 5న నీట్ యూజీ ప్రవేశపరీక్షను దాదాపు 24 లక్షల మంది రాశారు. ఇందులో 60 మందికి పైగా విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ రావడంతో పేపర్ లీకేజీ వార్తలొచ్చాయి. ఈ నెల 4న ఫలితాలు ప్రకటించగా బీహార్ తదితర రాష్ట్రాల్లో ప్రశ్నాపత్రాల లీకైనట్లు కాంగ్రెస్ సహా విపక్షాలు ఆరోపించాయి. దీనిపై జరిపిన విచారణలో, నీట్ ప్రవేశ పరీక్ష లీకేజీ వాస్తవమేనని నిర్ధారణ కావడంతో కౌన్సెలింగ్ నిలిపివేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు జాతీయస్థాయిలో ఆందోళన నిర్వహించారు. మొదట నీట్ నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రక్షాళనకు ఉన్నతస్థాయి కమిటీ వేసింది. ఈ కమిటీ ప్రతిపాదన మేరకు ఆదివారం జరగాల్సిన నీట్ పీజీ పరీక్షలను ఎన్టీఏ రద్దు చేసింది. ఈ పరీక్షలు రద్దుకావడం వల్ల వైద్యుల్లో నమ్మకం సన్నగిల్లిందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం తన ఎక్స్ పేజీలో అభిప్రాయం వ్యక్తం చేశారు. యూజీసీ నెట్ రద్దు అనంతరం ఎన్టీఏ నిర్వహించాల్సిన నీట్ పీజీ పరీక్షలను వాయిదా వేయడం వల్ల వైద్యులు కావాలనుకున్న వేలాది మంది నిరుత్సాహానికి గురయ్యారని సీఎం తెలిపారు. వైద్య విద్యార్థుల చివరి ఆశ నీట్ పరీక్షలేనని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారిలో నమ్మకాన్ని పెంచే విధంగా వారి భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నట్లు సీఎం స్టాలిన్ తెలిపారు.

నేడు విక్రవాండి

నామినేషన్ల పరిశీలన

చెన్నై, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికల నామినేషన్ల పరిశీలన సోమవారం జరుగనుంది. విక్రవాండి ఉప ఎన్నికలు జూలై 10న జరుగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ఈ నెల 21న ముగిసింది. విక్రవాండి తాలూకా కార్యాలయంలో ఎన్నికల అధికారి చంద్రశేఖర్ నామినేషన్లను స్వీకరించారు.



ఈ ఎన్నికల్లో డీఎంకే తరఫున అన్నియూరు శివా, పీఎంకే అభ్యర్థిగా సి.అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి తరఫున డాక్టర్ అభినయ పోటీచేస్తున్నారు. వీరితో సహా మొత్తం 64 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారి నామినేషన్లను సోమవారం పరిశీలించనున్నారు. ఈ నెల 26న నామనేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. ప్రస్తుతం ఆ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం తీవ్రస్థాయిలో జరుగుతోంది. డీఎంకే, పీఎంకే అభ్యర్థులు ఇప్పటికే ఎన్నికల కార్యాలయాలను తెరచి ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా ప్రచారం చేస్తున్నారు. డీఎంకే జిల్లా కార్యదర్శి గౌతమ్ శిఖామణి, మంత్రి సెంజి మస్తాన్ డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివాకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. పీఎంకే అభ్యర్థి అన్బుమణి, నామ్ తమిళర్‌కట్చి అభ్యర్థి డాక్టర్ అభినయా కూడా ఇంటింటి ప్రచారం కొనసాగిస్తున్నారు.


ఘటనా స్థలంలో స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

వీధి కొళాయిపైకి దూసుకెళ్ళిన కారు

ముగ్గురు మహిళల దుర్మరణం




మృతులు అమరావతి, శాంతి, పార్వతి (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా ఏరల్ సమీపం ముక్కాణి ప్రాంతంలో రోడ్డు పక్కన వీధికుళాయి వద్ద నీళ్లపడుతున్న వారిపై కారు అదుపుతప్పి దూసుకెళ్లడంతో ముగ్గురు మహిళలు దుర్మరణం చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలిలా.. తూత్తుకుడి పెరుంగుళం ప్రాంతానికి చెందిన మణికంఠన్ నాలుమావడి వద్ద సెల్‌ఫోన్ దుకాణం నడుపుతున్నాడు. రెండు రోజుల క్రితం కారులో తన స్నేహితులతో కలిసి బెంగళూరు వెళ్ళి సెల్‌ఫోన్లు, వాటి విడిభాగాలను కొనుగోలు చేసి తిరిగి స్వస్థలానికి బయలుదేరారు. ఆ కారు ముక్కాణి ప్రాంతం వద్ద అదుపు తప్పి వీధి కొళాయి వద్ద నీరుపడుతున్న మహిళలపై దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంలో నట్టార్ శాంతి (45), పార్వతి (40), అమరావతి (50) అనే ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. షణ్ముగతాయ్ అనే మరో మహిళ తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆమెను తూత్తుకుడి వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని కారు నడిపిన మణికంఠన్‌ను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా ప్రమాదం జరిగిన ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం వల్లే ముగ్గురు మహిళలు మృతిచెందినట్లు స్థానికులు ఆరోపించారు. అంతటితో ఆగకుండా ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ హఠాత్తుగా రాస్తారోకోకు దిగారు. సమాచారం తెలుసుకుని పోలీసు అధికారులు ఆందోళనకారులతో చర్చించి స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు ఆందోళనను విరమించుకున్నారు.

సీఎం స్టాలిన్ సంతాపం..

తూత్తుకుడి జిల్లా ఏరల్ సమీపం ముక్కాని గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన మహిళల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపిన సీఎం ఆర్థిక సాయం ప్రకటించారు. మృతి చెందిన ముగ్గురి కుటుంబాలకు తలా రూ.4లక్షలు చొప్పున, ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స కోసం లక్షరూపాయల సాయం అందించనున్నట్లు ఆయన ప్రకటించారు.

తాగొద్దని చెప్పలేం...

మితంగా తాగమని మాత్రమే చెప్పగలం

● కమల్‌హాసన్



కళ్లకుర్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న కమల్‌హాసన్

చెన్నై, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసలుగా మారుతున్న జనాన్ని తాగొద్దు అని బెదరించలేమని, మితంగా తాగమని మాత్రమే సలహా ఇవ్వగలమని మక్కల్ నీదిమయ్యం నాయకుడు, ప్రముఖ సినీనటుడు కమల్‌హాసన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఆయన కళ్లకుర్చిలోని చికిత్స పొదుతున్న కల్తీసారా బాధితులను పరామర్శించారు.ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కల్తీసారాకు యాభై మందికి పైగా ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనను తాను రాజకీయం చేయడానికి రాలేదని స్పష్టం చేశారు. బాధితులను ఓదార్చి, వారికి అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నానన్నారు. ఓ వీధిలో ఉండాల్సిన మందుల దుకాణాల కంటే అత్యధికంగా టాస్మాక్ దుకాణాలు ఉన్నాయని, తాగొద్దు అని సలహా ఇవ్వడం కంటే మితంగా తాగి ప్రాణాలు కాపాడుకో అని మాత్రమే చెప్పగలనన్నారు. మద్యం దుకాణాలన్నింటిని మూసివేయమని చెప్పడమూ భావ్యం కాదని, ఆదాయం పొందుతున్న ఏ ప్రభుత్వమూ దానికి సాహసించదన్నారు. కల్తీసారా మాత్రమే కాకుండా మద్యం కూడా ప్రమాదకరమైనదని ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.



చెన్నైలోని వీఐటీ యూనివర్సిటీ క్యాంపస్‌లో 'నేర న్యాయవ్యవస్థ నిర్వహణలో భారతదేశ ప్రగతిశీల మార్గం' అనే అంశంపై జరిగిన సదస్సు ముగింపు సభలో ప్రసంగిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

కొత్తకూటమి దిశగా సీమాన్ వ్యూహం



చెన్నై, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలలో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీలకు గట్టిపోటీ ఇచ్చి ప్రత్యేక ఓటు బ్యాంకు సంపాదించుకున్న నామ్ తమిళర్ కట్చి నాయకుడు సీమాన్ అప్పుడే శాసన సభ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. గంను కూటమిలో చేర్చుకోవాలని భావిస్తున్నారు. సీమాన్ మొదటి నుంచి డీఎంకే, అన్నాడీఎంకేలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ద్రవిడ పార్టీల నుండి రాష్ట్రాన్ని కాపాడటమే తన ధ్యేయమని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికలలో ఎనిమిది శాతం ఓటు బ్యాంక్ సంపాదించుకున్న సీమాన్ కొత్త పార్టీలతోనే కూటమి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ దిశగానే తమిళగ వెట్రి కళగం నాయకుడు విజయ్‌తో రహస్యమంతనాలు కూడా సాగిస్తున్నారు. ఇదే విధంగా ద్రావిడ పార్టీలతో పొత్తు పెట్టుకోని ఇతర పార్టీలను కూడా కలుపుకుని రాష్ట్రంలోని ప్రధానమైన మూడు కూటములకు దీటైన కూటమి ఏర్పాటు చేయాలనే వ్యూహంతో ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ అసెంబ్లీ ఎన్నికలల్లోగా బలమైన కూటమిని ఏర్పాటు చేయాలని సీమాన్ నిర్ణయించినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో డీఎంకే కూటమి, బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే, అన్నాడీఎంకే కూటమి ఇలా మూడు మెగా కూటములే ఉన్నాయి. 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లోనూ ఈ మూడు కూటములే కొనసాగనున్నాయి. ఈ పరిస్థితులలో సీమాన్ తన పార్టీ నాయకత్వంలో బలమైన కూటమి ఏర్పాటు చేసేందుకు వ్యూహరచన చేపడుతున్నారు. ఇప్పటికే రాజకీయ ప్రవేశం చేసిన సినీనటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళ

సమాచార దర్శిని

తంజావూరులో టైడల్ పార్క్

ఐసిఎఫ్, జూన్ 23: తంజావూరులో టైడల్ పార్క్ నిర్మాణపనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఐటీ శాఖలో ఉద్యోగ అవకాశాలు రూపొందించేందుకు ప్రభుత్వం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో మినీ టైడల్ పార్క్‌లు నిర్మించి సమాచార సాంకేతిక శాఖలకు కేటాయిస్తోంది. ఆ ప్రకారం, తంజావూరు పిళ్లయార్‌పట్టిలో టైడల్ న్యూ భవనాలు నిర్మించి త్వరలో ప్రారంభించనున్నారు. ఈ విషయమై సాంకేతిక శాఖ అధికారులు మాట్లాడుతూ... చెన్నై లాగానే కోయంబత్తూర్‌లో టైడల్ పార్క్ ఉందని, ఇటీవల విల్లుపురంలో మినీ టైడల్ పార్క్ ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం తంజావూరులో ఏర్పాటైన టైడల్ న్యూ భవనాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ త్వరలో ప్రారంభించనున్నార న్నారు. ఈ పార్క్ ద్వారా తిరువారూర్, నాగపట్టణానికి చెందిన యువకులకు ఉపాధి లభించే అవకాశముందని పేర్కొన్నారు.

35 పార్కుల ఏర్పాటు

ఐసిఎఫ్, జూన్ 23: చెన్నై కార్పొరేషన్‌కు చెందిన ఖాళీ స్థలాల్లో 35 పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. 'సింగార చెన్నై 2.0' పథకం కింద వీటిని ఏర్పాటుచేస్తున్నామని, జిమ్, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. అలాగే, వర్షాకాలంలో నీరు నిల్వచేరేలా స్పాంజ్ పార్కులు ఏర్పాటుచేస్తామన్నారు.

26 వరకు బీఎస్సీ నర్సింగ్ దరఖాస్తులు

ఐసిఎఫ్, జూన్ 23: బీఎస్సీ నర్సింగ్ సహా వైద్యానికి సంబంధించిన డిగ్రీ కోర్సులకు దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 26వ తేది వరకు పొడిగించారు. రాష్ట్రప్రభుత్వ వైద్యకళాశాలలు, తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్, బి.ఫార్మ్, బీఎస్సీ రేడియోథెరపి, బీఎస్సీ మెడికల్ రీసెర్చి టెక్నాలజీ, బీఎస్సీ డయాలసిస్ సహా 19 డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు మే 23 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై శనివారంతో ముగిసింది. కాగా ఈ గడువును 26వ తేది సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తూ వైద్య విద్య డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీచేసింది.

పెరిగిన టమోటా ధరలు

ఐసిఎఫ్, జూన్ 23: స్థానిక కోయంబేడు మార్కెట్లో టమోటా ధరలు పెరిగాయి. మార్కెట్‌కు ఆంధ్ర రాష్ట్రం నుంచి టమోటాలు దిగుమతవుతున్నాయి. వేసవి వర్షాలతో పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గింది. సాధారణంగా 55 నుంచి 60 లారీల్లో వస్తున్న టమోటాలు, ప్రస్తుతం 45 లారీల్లో దిగుమతవుతున్నాయి. పది రోజుల క్రితం కిలోటమోటాలు రూ.45కు విక్రయం కాగా, ప్రస్తుతం రూ.80కు విక్రయమవుతున్నాయి. అలాగే, మునక్కాయలు కిలో రూ.150, చిక్కుడు కాయలు కిలో రూ.80కు విక్రయమవుతున్నాయి.

విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, జూన్ 23: తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులో ఉన్న ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో 210 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఈ కేంద్రంలో తలా 210 మెగావాట్ల సామర్థ్యంతో 3 యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. ఇది నగర విద్యుత్ అవసరాలు పూర్తిచేస్తోంది. మూడవ యూనిట్‌లో శనివారం రాత్రి బాయిలర్ ట్యూబ్ పంచర్ కావడంతో ఉత్పత్తికి అంతరాయం కలిగింది.

62 ఆమ్నీ బస్సుల స్వాధీనం

ఐసిఎఫ్, జూన్ 23: ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబరు కలిగిన 62 ఆమ్నీ బస్సులు స్వాధీనం చేసుకున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,535 ఆమ్నీ బస్సులు రిజిస్ట్రేషన్ చేయించుకొని నడుస్తున్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ ఉన్న 905 ఆమ్నీ బస్సుల్లో 112 బస్సులకు మాత్రమే మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఇంకా 793 బస్సులకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే ఆమ్నీ బస్సుల తనిఖీలు ఈ నెల 18 నుంచి జరుగుతుండగా, రాష్ట్రవ్యాప్తంగా 62 ఆమ్నీ బస్సులను స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు.

మేట్టూరు జలాల విడుదల తగ్గింపు

పెరంబూర్, జూన్ 23: తాగునీటి కోసం మేట్టూరు డ్యాం నుంచి విడుదల చేస్తున్న జలాలను 1,000 ఘనపుటడుగులకు తగ్గించారు. ఆదివారం డ్యాం నీటిమట్టం 41.17 అడుగులనుంచి 40.93(పూర్తి సామర్థ్యం 120 అడుగులు) అడుగులకు తగ్గింది. ప్రస్తుతం డ్యాం నుంచి తాగునీటి కోసం 1,500 ఘనపుటడుగులు విడుదల చేస్తుండగా, నీటిమట్టాలు తగ్గుతుండడంతో నీటి విడుదలను 1,000 ఘనపుటడుగులకు తగ్గించారు. డ్యాంకు వస్తున్న నీరు 138 ఘనపుటడుగుల నుంచి 140 ఘనపుటడుగులకు పెరిగింది. ఆ ప్రకారం, డ్యాంలో ప్రస్తుతం 12.57 టీఎంసీల నీరు ఉన్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

15,764 మంది లైసెన్స్ రద్దు

ఐసిఎఫ్, జూన్ 23: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 15,764 మంది లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేసినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. గత ఏడాది జరిగిన 17,526 రోడ్డు ప్రమాదాల్లో 18,347 మంది మృతిచెందగా, ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు జరిగిన 4,151 ప్రమాదాల్లో 4,345 మంది మృతిచెందారు. వీటిని అరికట్టేందుకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి అధికారులు జరిమానా విధించి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తున్నారు. ఆ ప్రకారం, ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు 15,764 మంది వాహనచోదకుల లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేశామని అధికారులు తెలిపారు.

బీజేపీ నిర్వాహకుల తొలగింపు

పెరంబూర్, జూన్ 23: ఇద్దరు జిల్లా అధ్యక్షులు సహా ముగ్గురిని బీజేపీ నుంచి తొలగించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై విడుదల చేసిన ప్రకటనలో... తిరువారూరు జిల్లా అధ్యక్షుడు భాస్కర్, మైలాడుదురై జిల్లా అధ్యక్షుడు అఘోరం, తిరువారూరు జిల్లా ప్రధాన కార్యదర్శి సెంథిల్‌రసన్‌లను పార్టీనుంచి తొలగించినట్లు తెలిపారు.

102 బాణసంచా కర్మాగారాల లైసెన్స్ రద్దు

పెరంబూర్, జూన్ 23: విరుదునగర్ జిల్లాలో నిబంధనలు అతిక్రమించిన 102 బాణసంచా కర్మాగారాల లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జయశీలన్ విడుదల చేసిన ప్రకటనలో... జిల్లాలో 1,098 బాణసంచా కర్మాగారాలు, 3,000లకు పైగా బాణసంచా దుకాణాలున్నాయన్నారు. ఈ కర్మాగారాల్లో ప్రమాదాలు తగ్గించేలా పలు చర్యలు చేపట్టామన్నారు. భద్రతా చర్యలపై బాణసంచా కార్మికులు, యజమానులు మొత్తం 2,435 మందికి శిక్షణ ఇచ్చినట్టు మని తెలిపారు. ఈ శిక్షణకు హాజరుకాని 57 బాణసంచా కర్మాగారాలకు రూ.5,000 చొప్పున రూ.2.85 లక్షల జరిమానా విధించామన్నారు. ఈ ఏడాది 504 కర్మాగారాలు పరిశీలించి, వాటిలో నిబంధనలు అతిక్రమించిన 102 కర్మాగారాల లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేశామని కలెక్టర్ తెలిపారు.

యర్రమిల్లి రామకృష్ణ సేవలు చిరస్మరణీయం

● జయంతి సభలో వక్తలు



యర్రమిల్లి రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అజంతా శంకరరావు, రెంటాల జయదేవ, గుడిమెట్ల చెన్నయ్య తదితరులు

ప్యారీస్, జూన్ 23: అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక సమితి వ్యవస్థాపకులు యర్రమిల్లి రామకృష్ణ సాహిత్య, సామాజిక, విద్యారంగాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. మైలాపూర్‌లోని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవనంలో ఆదివారం రామకృష్ణ 81వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షుడు అజంతా డా.కనిగెలుపుల శంకరరావు సభాధ్యక్షుడిగా వ్యవహరించి సభకు హాజరైన వారితో కలసి రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంగీత, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు తెలుగు భాషా మాధుర్యాన్ని తెలుగు కుటుంబాలకు అందించాలన్న ఆశయంతో రామకృష్ణ స్థాపించిన సమితి ద్వారా 'నెల నెలా వెన్నెల' కార్యక్రమాన్ని సమితి నిర్వాహకులు, సభ్యుల సహకారంతో విజయవంతంగా నిర్వహించగలుగుతున్నామన్నారు. అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిర్మాణానికి ముఖ్యకారకులైన వైఎస్ శాస్త్రి కుమారుడిగా సమాజానికి రామకృష్ణ ఎనలేని సేవలందించారని కీర్తించారు. మహానగరం చెన్నైలో తెలుగు వారికంటూ ఉన్న ఏకైక ప్రభుత్వ భవనం అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవనమేనని, దానిని ఏపీ ప్రభుత్వం, తెలుగు సంఘాలతో కలిసి అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సింగపూర్ వైద్యుడు డా.పళనియప్పన్, డా.సెల్వైకుమార్, కేఎంసీ ప్రభుత్వాసుపత్రి రేడియాలజిస్ట్ డా.దేవిమీనాళ్, జనని సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, సీనియర్ పాత్రికేయుడు రెంటాల జయదేవ ఆత్మీయ అతిథులుగా పాల్గొని రామకృష్ణతో తమకున్న అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా రామకృష్ణకు సంబంధించిన 'అందమైన జీవితం' వీడియో ప్రదర్శించారు. అలాగే, టి.నగర్ కేసరి మహోన్నత పాఠశాల విద్యార్థులు, నర్తకి మునెపల్లి హంసిని నృత్య ప్రదర్శన, జోసుల శైలేష్ పద్యపఠనం, అనురాధ పుస్తక విలాపం, ఘంటసాల సావిత్రి భావగీతాలు, ప్రముఖ గాయని ఎస్పీ వసంతలక్ష్మి, సరస్వతి హాస్యగుళికలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందర్నీ అలరించిజేశాయి. డా.తుమ్మపూడి కల్పన వ్యాఖ్యాతగా వ్యవహరించగా, పసుమర్తి జయశ్రీ, దామెర్ల పద్మావతి, గుర్రం బాలాజీలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

1 నుంచి టీచర్ల బదిలీ కౌన్సెలింగ్

ప్యారీస్, జూన్ 23: ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు జూలై 1 నుంచి 31వ తేది వరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఆదివారం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల జనరల్ బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. బదిలీ కోరే టీచర్లు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించారు. మే 13న ప్రారంభమై 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సారి ఎన్నడూ లేని విధంగా మొత్తం 82,477 మంది టీచర్లు బదిలీ కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ మే 24 నుంచి జూన్ 30వ తేది వరకు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. అయితే దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించిన కారణంగా కౌన్సెలింగ్ తేది ప్రకటించకుండా వాయిదావేసింది. ఇదిలా ఉండగా, 2024-25వ విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ టైంటేబుల్ సవరించి శనివారం కొత్త టైంటేబుల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. అందులో వివరాల మేరకు బదిలీ కోరుతూ దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ మహోన్నత, ఉన్నత పాఠశాలల టీచర్ల సీనియారిటీ జాబితా జూలై 3న విడుదల కానుంది. ఇందులో లోపాలున్నట్లయితే 4,5 తేదీల్లో విన్నవించుకున్నాక, తుది సీనియారిటీ జాబితా 6న విడుదల కానుంది. ఆ తర్వాత అన్ని కేటగిరీలకు చెందిన టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ జిల్లాస్థాయిలో పలు రౌండ్లుగా 8 నుంచి 31వ తేది వరకు జరుగుతుంది. అదే విధంగా, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల టీచర్లకు జూలై 1 నుంచి 31వ తేది వరకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

తిరువళ్లూర్ జిల్లాలో సారా స్వాధీనం

● మహిళలు సహా 45 మంది అరెస్ట్

ప్యారీస్, జూన్ 23: తిరువళ్లూర్ జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్ పోలీసులు మహిళలు సహా 45 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి 1,500 లీటర్ల కల్తీ సారా స్వాధీనం చేసుకున్నారు. మరో 105 మందిపై కేసు నమోదుచేశారు. జిల్లా పరిధిలోని రెడ్‌హిల్స్ ప్రాంతంలో ఉన్న గోదాములో మెథనాల్ కలిపిన సారా ప్యాకెట్లు ఉంచారనే సమాచారంతో పోలీసుల బృందం ఆ గోదామును ముట్టడించింది. తనిఖీల్లో కల్తీ సారా స్వాధీనం చేసుకొని 45 మందిని అరెస్ట్ చేశారు. కొరుక్కుపేటకు చెందిన గౌతమ్, పరమశివం, రామ్‌కుమార్ , మాధవరానికి చెందిన హాస్సీలాల్ లను విచారించి, వారిచ్చిన సమాచారంతో జిల్లావ్యాప్తంగా గోదాముల్లో ఈ నెల 19వ తేది మొదలుపెట్టిన తనిఖీలు ఆదివారం ఉదయం వరకు కొనసాగించారు. ఇందులో టాస్మాక్ మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన 105 మందిపై కేసు నమోదుచేసి 31 మందిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి 519 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఆంధ్ర రాష్ట్రం నుంచి అక్రమంగా కల్తీ సారాను రాష్ట్ర సరిహద్దులోని ఆర్కే పేట వద్ద స్వాధీనం చేసుకున్న పోలీసులు, నలుగురు మహిళలు సహా 10 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 53 లీటర్ల కల్తీ సారా స్వాధీనం చేసుకున్నారు.

దంపతుల ఆత్మహత్య

ప్యారీస్, జూన్ 23: కుటుంబ కలహాలు ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్న దంపతులను బలిగొన్నాయి. పోలీసుల కథనం మేరకు... సేలం జిల్లా దారమంగళం తొట్టంబట్టికి చెందిన భూపాలన్ (22) అదే ప్రాంతానికి చెందిన మేఘల (21) ఏడాది కిత్రం ప్రేమ వివాహం చేసుకున్నారు. శుక్రవారం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో మనస్తాపం చెందిన భూపాలన్ విషం తాగి ఇంట్లో స్పృహ కోల్పోయాడు. ఇరుగుపొరుగు వారి సాయంతో ఆయనను మేఘల సేలం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. భూపాలన్ ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలియజేయడంతో, దిగ్భ్రాంతికి గురైన ఆమె ఆస్పత్రి ప్రాంగణంలో మార్చురీ సమీపంలో చెట్టుకు శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో, చికిత్స ఫలించక భూపాలన్ ఆదివారం ఉదయం మరణించడంపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సారా స్థావరాల దాడికివెళ్లిన ఏడుగురు పోలీసులు మిస్సింగ్

పెరంబూర్, జూన్ 23: కళ్లకుర్చి జిల్లాలోని కాల్వరాయన్ కొండల్లో సారా వేటకు వెళ్లిన తిరుచ్చి బెటాలియన్‌కు చెందిన ఏడుగురు పోలీసులు అడవిలో తప్పిపోయారు. ఈ జిల్లాలోని కరుణాపురంలో కల్తీ సారా తాగి 60 మందికి పైగా మృతిచెందగా, మరో 150 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలనే రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వులతో, ఎక్సైజ్, పోలీసు శాఖకు చెందిన సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా, కొండ ప్రాంతాల్లో సారా తయారీ ఎక్కువగా ఉందనే సమాచారంతో ఆ ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో, కళ్లకుర్చి జిల్లా కల్వరాయన్ కొండ ప్రాంతంలో తిరుచ్చి బెటాలియన్ పోలీసులు గాలింపు చర్యలకు వెళ్లారు. సుమారు 20 మంది పోలీసులు పాల్గొనగా 13 మంది తిరిగి వచ్చారు. మిగిలిన ఏడుగురు అడవి మార్గంలో తప్పిపోయి ఉంటారని భావిస్తున్న సహచర సిబ్బంది, వారి కోసం గాలిస్తున్నారు.

వేడుకగా ద్రౌపది అమ్మన్ ఉత్సవాలు

వేలూరు, జూన్ 23: స్థానిక కాట్పాడి సమీపం విన్నంపల్లి గ్రామంలో ద్రౌపది అమ్మవారి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దుర్యోధనుడి వధ కార్యక్రమ నిర్వహించారు. కళగ అమైపు సెక్రటరీ రాము పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు.

ఆగని శ్రీలంక నావికాదళం ఆగడాలు

● 22 మంది రామేశ్వరం జాలర్ల అరెస్టు

చెన్నై, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం మరోమారు తమిళ జాలర్లపై పంజా విసిరింది. తమ దేశ సముద్రజలాల్లో అక్రమంగా చొరబడ్డారంటూ జాలర్లపై దాడులకు పాల్పడింది. వలలు, చేపలను ధ్వంసం చేసింది. అంతటితో ఆగకుండా 22 మంది జాలర్లను అరెస్టు చేసింది. రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి 500 మరపడవల్లో మూడువేల మందికి పైగా జాలర్లు రెండు రోజుల క్రితం సముద్రంలో చేపలవేటకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో కచ్చాదీవికి సమీపంలో ఆదివారం వేకువజామున తమిళజాలర్లు చేపలుపడుతుండగా ఐదు గస్తీ నౌకల్లో వచ్చిన శ్రీలంక నావికాదళం దాడులు జరిపి 22 మంది జాలర్లను అదుపులోకి తీసుకుంది. రెస్మన్, జస్టిన్, కెరిన్ అనే ముగ్గురికి చెందిన మూడు మరపడవలను కూడా స్వాధీనం చేసుకుంది. ఈ సంఘటన కారణంగా కచ్చాదీవిలో చేపలు పడుతున్న జాలర్లంతా ప్రాణభయంతో తీరానికి తిరిగొచ్చారు. ఈ సంఘటనపై రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులు మత్స్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఆలయ ఉత్సవంలో మాంసాహార విందు



విందు భోజనంలో పాల్గొన్న పురుషులు

ఐసిఎఫ్, జూన్ 23: తిరుచ్చులి సమీపంలోని ఆలయ ఉత్సవంలో భక్తులకు మాంసాహార విందు ఏర్పాటుచేశారు. మదురై, విరుదునగర్ జిల్లాల్లో ఉన్న ఆలయాల ఉత్సవాలంటేనే పొట్టేళ్ల బలిచ్చి, విందు భోజనాలు ఏర్పాటుచేస్తుంటారు. ముఖ్యంగా, గ్రామాల్లోని ఆలయాల్లో 100కు పైగా పొట్టేళ్లను బల్లిచ్చి, పురుషులకు మాత్రమే అన్నదానం అందజేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆ ప్రకారం, విరుదునగర్ జిల్లా తిరుచ్చులి సమీపంలో ఉన్న తమిళ్‌పాడి గ్రామంలో మంద కుమారస్వామి ఆలయంలో ప్రతి ఏటా పొంగల్ ఉత్సవాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది ఉత్సవాలను పురస్కరించుకొని పొంగళ్లు పెట్టి, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కుగా సమర్పించిన సుమారు 150కి పైగా పొట్టేళ్లను స్వామివారికి బలిచ్చి, మాంసాహార విందు ఏర్పాటుచేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పురుషులు భారీగా వేలసంఖ్యలో పాల్గొన్నారు.

తండయార్‌పేటలో కారు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్యారీస్, జూన్ 23: స్థానిక రాయపురం నియోజకవర్గ పరిధిలోని తండయార్‌పేటలో నడుస్తున్న కారులో హఠాత్తుగా మంటలు వ్యాపించడంతో కారు దగ్ధమైంది. తండయార్‌పేట తాండవరాయన్ వీధికి చెందిన యోగరాజ్ ఆదివారం ఉదయం తన కారులో న్యూ వాషర్‌మెన్‌పేటకు బయల్దేరాడు. తండయార్‌పేట హైరోడ్డులో వెళ్తుండగా కారు ముందు భాగం నుంచి హఠాత్తుగా పొగలు రావడం గమనించిన యోగరాజ్, కారు ఆపాడు. యోగరాజ్ అందించిన సమాచారంతో అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హిజ్రాలకు గుర్తింపుకార్డుల పంపిణీ



వేలూరు, జూన్ 23: స్థానిక సత్తువాచేరిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి హిజ్రాలకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉషా, జిల్లా ముఖ్యమంత్రి విస్తీర్ణ పథక అధికారి ఆనందరాజ్, పలు శాఖల అధికారులు, హిజ్రాలు, ప్రజలు పాల్గొన్నారు.

సముద్రతీరంలో నగ పోగొట్టుకున్న భక్తురాలు

● గాలించి వెలికితీసిన మెరైన్ సెక్యూరిటీ ఫోర్స్



తీరంలో గాలిస్తున్న సెక్యూరిటీ ఫోర్స్ (మరో చిత్రంలో) మహిళకు నగ అందజేస్తున్న దృశ్యం

పెరంబూర్, జూన్ 23: తిరుచెందూర్ సముద్ర తీరంలో పుణ్యస్నానాలు చేసిన ఓ మహిళ పోగొట్టుకున్న 5 సవర్ల చైన్‌ను మెరైన్ సెక్యూరిటీ ఫోర్స్ గాలించి వెలికితీశాయి. సముద్రతీరానికి ఆదివారం ఉదయం వచ్చిన ఓ మహిళ పుణ్యస్నానాలు చేస్తుండగా మెడలోని 5 సవర్ల నగ నీళ్లలో పోగొట్టుకుంది. సమాచారం అందుకున్న మెరైనా సెక్యూరిటీ ఫోర్స్ , జాలర్లు మొత్తం 50 మంది గాలించారు. సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన వేలుస్వామికి నీళ్లలో పడిన నగ దొరికింది. మళ్లీ ఆ నగను సదరు భక్తురాలికి అందించగా, భక్తులు దళాన్ని అభినందించారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

● రెండు వాహనాలు సహా నాలుగు ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, జూన్ 23: అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలతో పాటు కారు, మోటరుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ సురేష్‌బాబు బృందం శనివారం రాత్రి నుంచి అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. ముదుంపాడు అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు కనిపించారు. దీంతో వారిని చుట్టుముట్టేలోగా పారిపోవడానికి యత్నించారు. అయితే వారిలో ముగ్గురిని పట్టుకోగలిగారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన విజయకుమార్(37), మోహనవేల్(25), శక్తివేల్(27)గా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు



వచ్చే ఏడాది నుంచి బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు

పెరంబూర్, జూన్ 23: రాష్ట్రంలో వచ్చే ఏడాది నుంచి 5జీ సేవలు అందించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ తమిళనాడు రీజియన్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'మేకిన్ ఇండియా' పథకంలో భాగంగా బీఎస్ఎన్ఎల్ ప్రైవేటు సంస్థలకు దీటుగా సేవలందిస్తుందన్నారు. ప్రైవేటు సంస్థలు విదేశాల నుంచి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం పొందుతుండగా, బీఎస్ఎన్ఎల్ దేశీయ సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తుందని తెలిపారు. మరో ఆరు నెలల్లో తమ సంస్థ 4జీ సేవలందించనుందని, అనంతరం వచ్చే ఏడాది 5జీ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. తమ సంస్థకు దేశవ్యాప్తంగా ఉన్న సంస్థ ఆస్తులు నేరుగా విక్రయించాలని కేంద్ర టెలికమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ నిర్ణయించిందన్నారు. ఆ ప్రకారం, రాష్ట్రంలో రూ.60 కోట్ల విలువైన సూలూరు, మేట్టుపాళయం, ఉడుమలైపేట, విల్లుపురం, పుదుచ్చేరి తదితర ప్రాంతాల్లో ఉన్న స్థలాలు విక్రయించనున్నామని తెలిపారు. ఆన్‌లైన్ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు జూలై 1వ తేది మధ్యాహ్నం 3 గంటల్లోపు పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9486100871, 9437345839 అనే నెంబర్లు సంప్రదించాలని ఆయన తెలిపారు.

సేలం-మైలాడుదురై ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పులు

ఐసిఎఫ్, జూన్ 23: మరమ్మతుల కారణంగా సేలం-మైలాడుదురై ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పులు చేపట్టారు. సేలం-మైలాడుదురై ఎక్స్‌ప్రెస్ కరూర్ వరకు మాత్రమే నడుస్తుంది. అక్కడి నుంచి అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు మైలాడుదురైకు సోమవారం సాయంత్రం 4.45 గంటలకు, 27వ తేది సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరనుంది. అలాగే, తిరుచ్చి-ఈరోడ్ అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు తిరుచ్చి నుంచి సాయంత్రం 4.10 గంటలకు బదులుగా సోమవారం సాయంత్రం 5.10 గంటలకు, 27వ తేది సాయంత్రం 4.40 గంటలకు బయల్దేరనుంది. 27వ తేది పాలక్కాడు టౌన్-తిరుచ్చి రైలు కరూర్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుచ్చి-పాలక్కాడు టౌన్ రైలు కరూర్ నుంచి పాలక్కాడు టౌన్ వరకు నడువనుంది.

పైన్ ఫారెస్ట్ సందర్శనకు అనుమతి

పెరంబూర్,జూన్23: నీలగిరి జిల్లా ఊటీ సమీపంలోని పర్యాటక ప్రాంతం పైన్ ఫారెస్ట్‌కు పర్యాటకులను అనుమతించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో మూడు రోజుల క్రితం పులి సంచరించిందని తెలియడంతో ఆ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తనిఖీలు చేశారు. ఆ కారణంగా ఆ ప్రాంతంలో పర్యాటకులకు నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో, తనిఖీల్లో పులి సంచరించిన దాఖలాలు లేవని నిర్ధారించిన అధికారులు, ఆదివారం నుంచి ఈ ప్రాంతానికి పర్యాటకులను అనుమతించారు.

సెమిస్టర్ పరీక్షలు సకాలంలో నిర్వహించాలి

పెరంబూర్, జూన్ 23: ఉన్నత విద్యా సంస్థలు చివరి సెమిస్టర్ పరీక్షలు సకాలంలో నిర్వహించాలని యూజీసీ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు యూజీసీ కార్యదర్శి మనీష్ ఆర్, జోషి విడుదల చేసిన ప్రకటనలో... కొన్ని ఉన్నత విద్యాసంస్థలు చివరి సెమిస్టర్ పరీక్షలు నిర్వహణలో జాప్యం చేస్తున్నట్లు ఫిర్యాదులందుతున్నాయన్నారు. అనంతరం జవాబుపత్రాల మూల్యాంకనం, ఫలితాల విడుదల, సర్టిఫికెట్లు అందించడంలో మరింత జాప్యం జరుగుతుండడంతో విద్యార్థులు సరైన సమయంలో ఉద్యోగాలు పొందలేకపోతున్నారని విచారణలో తెలిసిందన్నారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా చివరి సెమిస్టర్ పరీక్షలు సకాలంలో నిర్వహించి, ఫలితాలు విడుదల చేసి, 180 రోజుల్లో సర్టిఫికెట్లు అందించాలని, ఈ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు చేపడతామని యూజీసీ సర్క్యులర్‌లో తెలిపింది.

గూండా చట్టం కింద ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, జూన్ 23: ఉత్తర చెన్నైలో ఇద్దరు రౌడీలను గూండా చట్టం కింద అరెస్ట్ చేసినట్లు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయం ప్రకటించింది. న్యూ వాషర్‌మెన్‌పేటకు చెందిన రమేష్ (20)పై హత్య, హత్యాయత్నం, దోపిడీ యత్నం, గంజాయి అక్రమ తరలింపు అని 12కు పైగా కేసులు నమోదై ఉన్నాయి. అదే ప్రాంతానికి చెందిన విఘ్నేష్ (28)పై కూడా ఆరు క్రిమినల్ కేసులున్నాయి. ఈ నేపథ్యంలో, వాషర్‌మెన్‌పేట అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ శక్తివేల్, తిరువొత్తియూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఇళంగోవన్ ప్రతిపాదనల మేరకు పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్, ఈ రౌడీలిద్దర్నీ గూండా చట్టం కింద అరెస్ట్ చేయాలంటూ ఉత్తర్వులు జారీచేశారు.

జిప్మర్ నుంచి ఐదుగురు డిశ్చార్జి

ప్యారీస్, జూన్ 23: కల్తీ సారా తాగి అనారోగ్యంతో పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్లో ఐదుగురు కోలుకొని ఇంటికెళ్లినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. కళ్లకుర్చి కరుణాపురంలో విక్రయించిన కల్తీ సారా తాగి 60 మంది మృతిచెందగా, సుమారు 150 మందికి పైగా పుదుచ్చేరి, సేలం, కళ్లకుర్చి ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఈ కల్తీ సారా దుర్ఘటనపై దర్యాప్తు చేపట్టిన సీబీసీఐడీ ఇప్పటివరకు 10 మందిని అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలో, ప్రాణాపాయ స్థితిలో పుదుచ్చేరి జిప్మర్ ఆసుపత్రిలో చేరిన 20 మందిలో చికిత్స ఫలించక ముగ్గురు మృతిచెందారు. మిగతా 17 మందిలో ఐదుగురు పూర్తిగా కోలుకొని ఆదివారం డిశ్చార్జి అయ్యారు. వీరు కరుణాపురానికి చెందిన వారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

టీవీకే ఆధ్వర్యంలో అన్నదానం



వేలూరు, జూన్ 23: సత్తువాచేరిలోని కలెక్టర్ కార్యాలయ సమీపం వాపూసీనగర్ భక్తాంజనేయ ఆలయ ప్రాంగణంలో టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ 50వ జన్మదినం సందర్భంగా అన్నదానం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షుడు వేల్‌మురుగన్ అధ్యక్షత వహించగా, 1,000 మంది కి అన్నదానం చేశారు. సత్తువాచేరిప్రాంత నిర్వాహకులు మణికంఠన్, గోకుల్, సోమేశ్వరన్, భరత్, మదన్, రంజిత్, యోగ సుబ్రమణ్యన్ పాల్గొన్నారు.

కళ్లకుర్చి మరణాలపై సీబీఐ విచారణ

● కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ డిమాండ్

పెరంబూర్, జూన్ 23: కళ్లకుర్చి కల్తీ సారా మృతుల వ్యవహారంపై సీబీఐ విచారణ చేపట్టాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ... కల్తీ సారా తాగిన సుమారు 200 మంది ఇంకా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యుల ద్వారా తెలుస్తుందన్నారు. మృతిచెందిన వారిలో అధిక శాతం షెడ్యూల్ కులాలకు చెందిన వారున్నారన్నారు. టాస్మాక్ దుకాణాల ద్వారా రాష్ట్రప్రభుత్వమే మద్యం విక్రయిస్తున్న నేపథ్యంలో, కళ్లకుర్చి తదితర ప్రాంతాల్లో కల్తీసారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్నారు. కళ్లకుర్చి ఘటనకు వ్యతిరేకంగా ఇప్పటివరకు కాంగ్రెస్ మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్కడికెళ్లారు? రాహుల్ గాంధీ ఎక్కడ? ఎన్నికల్లో ఓట్ల కోసం వెళ్లే వారు ఈ ఘటనపై ఎందుకు స్పందించడంలేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు.

కచ్ఛాదీవికి కేంద్ర ప్రభుత్వం విముక్తి కలిగించాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్

ప్యారీస్, జూన్ 23: శ్రీలంక ఆధీనంలో ఉన్న కచ్చాదీవిని ప్రధాని నరేంద్ర మోదీ విడిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోయిల్‌లో మీడియాతో మాట్లాడుతూ... నీట్, నెట్ తదితర ప్రవేశ పరీక్షలు సహా కేంద్రీయ విద్యను రాష్ట్ర జాబితాగా మార్చాలని కోరారు. కళ్లకుర్చి దుర్ఘటనలో సంబంధాలున్న వారు ఎంతటి వారైనా వదిలిపెట్టకుండా శిక్షించాలన్నారు. ప్రస్తుతం భారత్-శ్రీలంక దేశాల మధ్య మంచి సంబంధాలున్నాయని, మూడో సారి ప్రధాని బాధ్యతలు చేపట్టిన ప్రధాని మోదీ లంక ఆధీనంలో ఉన్న కచ్చాదీవిని విడిపించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రైల్వే పథకాలు సహా కావేరి, మెకెదాటు తదితర నీటి సమస్యలపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న మెతక వైఖరిని విడనాడాలని కోరారు. డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామి మేరకు రాష్ట్రవ్యాప్తంగా 500 టాస్మాక్ మద్యం దుకాణాలు మూసివేశారని, అలా మూసివేసిన దుకాణాల్లో దొంగచాటుగా కల్తీ సారా తయారుచేస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, దీనిపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ముత్తరసన్ కోరారు.

బతికున్నంత వరకు సారా జోలికి వెళ్లం

● కోలుకున్న ఇద్దరు కార్మికులు

ప్యారీస్, జూన్ 23: కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న ఇద్దరు కార్మికులు బతికున్నంత వరకు సారా ముట్టమని ప్రతిజ్ఞ చేశారు. కరుణాపురంలో కల్తీ సారా తాగిన సుమారు 200 మందిలో 60 మందికి పైగా మృతిచెందగా, మిగతా వారు చికిత్స పొందుతున్నారు. వీరిలో మొట్టయన్ (70), సిలంబరసన్ (58) అనే కార్మికులు ఈ నెల 18 సాయంత్రం కల్తీ సారా తాగి వాంతులు చేసుకొని స్పృహ కోల్పోయారు. కళ్లకుర్చి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న వీరిద్దరూ ఆదివారం ఉదయం డిశ్చార్జి అయ్యారు. తాము బతికున్నంత వరకు సారా జోలికి వెళ్లమని, తమ కుటుంబాలను చక్కగా పోషించుకుంటామని అందరి ముందు ప్రతిజ్ఞ చేశారు.

చిత్రజ్యోతి



'డీఎన్‌ఏ' డబ్బింగ్ షురూ

అధర్వ మురళి - నిమిషా సజయన్ జంటగా నటించిన చిత్రం 'డీఎన్‌ఏ' చిత్రీకరణ పూర్తి చేసుకుని సంప్రదాయ పూజ కార్యక్రమంతో డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 'ఫర్హానా', 'మాన్‌స్టర్' వంటి వైవిధ్యభరితమైన చిత్రాలను నిర్మించిన నెల్సన్ వెంకటేశన్ ఈ చిత్రానికి దర్శకుడు. ఒలింపియా మూవీస్ బ్యానరుపై ప్రముఖ నిర్మాత అంబేత్ కుమార్ నిర్మించారు. మంచి కథలతో పాటు విభిన్నమైన పాత్రలను ఎంచుకుని తన కెరీర్‌ను కొనసాగిస్తున్న సీనియర్ నటుడు దివంగత మురళి తనయుడు అధర్వ మురళి నటించిన చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలే నెలకొన్నాయి. ఈ చిత్రం డబ్బింగ్ శరవేగంగా పూర్తి చేసి ఆగస్టులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో దర్శకుడు బాలాజీ శక్తివేల్, రమేష్ తిలక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

మ్యూజిక్ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యుల రాజీనామాలు !!



శబేశన్

తమిళ సినిమా మ్యూజిక్ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. కోశాధికారి, ఉపాధ్యక్షుడు మినహా మిగిలిన సభ్యులంతా రాజీనామాలు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సంఘానికి ఫిబ్రవరి 18న ఎన్నికలు జరిగాయి. సంఘం అధ్యక్ష పదవికి దినా, శబేశన్ పోటీ చేయగా, అప్పటివరకు అధ్యక్షుడిగా కొనసాగిన దినా ఓడిపోగా, శబేశన్ విజయం సాధించారు. అలాగే, ప్రధాన కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా పద్మశ్రీ బాలేష్, మూర్తి రఘురామన్, జాయింట్ సెక్రటరీలుగా సెల్వరాజ్, వెంకటేష్, మహ్మద్ ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బాలేష్ మినహా మిగిలిన సభ్యులంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. దీనికి ప్రధాన కారణం కూడా ఉంది. ఈ సంఘానికి పక్కా భవనం నిర్మించేందుకు వీలుగా ఒక ట్రస్ట్ ఉంది. ఇందులో మాజీ అధ్యక్షుడు దినా, ఆయన అనుచరులున్నారు. సంఘం అధ్యక్షుడుగా దినా ఉన్న కాలంలో ఈ ట్రస్ట్‌లో నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో దినా, ఆయన అనుచరులతో కలిసి ముందుకు సాగలేక శబేశన్, ఇతర కార్యవర్గ సభ్యులు రాజీనామాలు చేశారు. మ్యూజిక్ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులంతా ఒక్కసారిగా రాజీనామాలు చేయడం ఇపుడు కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.

చేతబడి నేపథ్యంలో '7జి'



'7జి'లో సోనియా అగర్వాల్

సీనియర్ నటి సోనియా అగర్వాల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం '7జి'. చేతబడి నేపథ్యంలో ఒక ఫీల్ గుడ్ మూవీగా రూపొందించారు. హారూన్ దర్శకుడు. డ్రీమ్ హౌస్ బ్యానరుపై దర్శకుడు హారూన్ కథ సమకూర్చి నిర్మించారు. సోనియా అగర్వాల్, స్మృతి వెంకట్ అద్భుత నటనతో ప్రతి ఒక్కరినీ భయపెట్టే హర్రర్ మూవీగా తెరకెక్కించగా వచ్చే నెల 5వ తేదీన విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'తనకంటూ ఓ సొంత ఇల్లు ఉండాలని భావించిన ఒక యువతి కొత్తగా ఇంటిని కనుగోలు చేసి నివసిస్తుంది. కొన్ని రోజుల తర్వాత ఆ ఇంట్లో కొన్ని భయపెట్టే సంఘటనలు జరుగుతున్నట్టు గుర్తించి, ఇంటిలో చేతబడి చేసినట్టు గ్రహిస్తుంది. వీటి వెనుక ఉన్న నిజాలను తెలుసుకునేందుకు ప్రయత్నించిన ఆమెకు కొన్ని ఊహించని సంఘటనలు ఎదురవుతాయి. వీటిని ప్రేక్షకుడు సీట్ ఎడ్జింగ్ థ్రిల్‌కు ఫీలయ్యేలా ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేలా రూపొందించాం అని పేర్కొన్నారు.

ఆ రెండు భాషల్లో ఎక్స్‌పోజింగ్ అవకాశం

● మాళవిక మేనన్



మలయాళంలో గ్లామర్ పాత్రలకు అవకాశం లేదని, కానీ తమిళం, తెలుగు భాషల్లో మాత్రం ఉందని హీరోయిన్ మాళవిక మేనన్ అంటున్నారు. మలయాళ చిత్రపరిశ్రమలో గుర్తింపు పొందిన ఆమె.. అటు మాతృభాషతో పాటు ఇటు కోలీవుడ్, టాలీవుడ్‌లో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలో తన సినీ జీవితం గురించి ఆమె మాట్లాడుతూ, 'నేను తొలిసారి నటించిన చిత్రం 'నిద్ర'. అపుడు నా వయసు 14 యేళ్ళు. హీరో చెల్లి పాత్రలో నటించాను. '916' అనే చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. తొలిసారి హీరోయిన్‌గా నటించే సమయంలో అనేక సమస్యలతో పాటు సవాళ్ళను కూడా ఎదుర్కొన్నాను. మలయాళంలో గ్లామర్ పాత్రలకు అవకాశం లేదు. కానీ, తమిళం, తెలుగు భాషా చిత్రాల్లో మాత్రం నటించవచ్చు. ఎక్స్‌పోజింగ్ బాగా చేసే పాత్రలు లభిస్తాయి. అలాగే, ఇప్పటివరకు ముద్దు సన్నివేశాల్లో నటించలేదు. కథ డిమాండ్ చేస్తే, ఆ పాత్ర లేదా సన్నివేశం ప్రజాదారణ పొందుతుందని భావిస్తే ఖచ్చితంగా నటిస్తాను' అని పేర్కొన్నారు.



కాశిమేడు చేపలరేవు మార్కెట్ వద్ద చేపలు విక్రయిస్తున్న జాలర్లు

కాశిమేడులో కోలాహలం

ఊపందుకున్న చేపల విక్రయం

చెన్నై, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కాశిమేడులో ఆదివారం చేపల విక్రయాలు ఊపందుకున్నాయి. రెండు వారాల తర్వాత అక్కడి మార్కెట్‌లో మేలి రకం చేపల విక్రయం ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన 61 రోజుల చేపలవేట నిషేధ కాలం ముగిసి ఈ నెల 15 వేకువజాము సముద్రంలో చేపలవేటకు వెళ్ళిన కాశిమేడు జాలర్లు ఆదివారం వేకువజామున బుట్టల నిండుగా మత్స్య సంపదతో తిరిగొచ్చారు. దీంతో ఆదివారం ఉదయం చేపలు కొనేందుకు వెళ్ళిన నగరవాసులతో కాశిమేడు రేవు చేపలమార్కెట్ సందడిగా మారింది. ఈ మార్కెట్‌లో గత వారం కేజీ వంజరం చేపలు రూ.1500లకు విక్రయించగా, ప్రస్తుతం ఆ చేపల ధర రూ.1200లకు తగ్గింది. దీంతో నగరవాసులు వంజరం చేపలను పోటీపడి కొనుగోలు చేశారు. ఇదే విధంగా కేజీ వవ్వాల్ చేపలు కూడా రూ.1200లకు విక్రయించారు. కేజీ శంకరా చేపలు రూ.350లకు, షీలా చేపలు రూ.250లకు, కిళంగా చేపలు రూ.300లకు, టైగర్ ఇరాల్ చేపలు రూ.1000లకు విక్రయించారు. ఇక కేజీ పీతలను రూ.300లకు విక్రయించారు. ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు నగరం నలుమూలల నుండి వచ్చిన నగరవాసులు పోటీపడి చేపలను కొనుగోలు చేసుకెళ్ళారు.



చేపల కోసం గుమికూడిన నగరవాసులు

పెద్దలు సమాజానికి మార్గదర్శకులు

● సీనియర్ సిటిజన్స్ సేవలు అందరికీ అవసరం ● వామ్ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ



తంగుటూరి రామకృష్ణ, అజంతా శంకరరావు, తాడేపల్లి రాజశేఖర్‌లను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, జూన్ 23: సీనియర్ సిటిజెన్స్ సేవలు సమాజానికి ఎంతో అవసరమని, పెద్దల సలహాలను పాటిస్తే జీవితం సుఖాంతంగా ఉంటుందని వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్) గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పుదుపేటలోని నాదుముని హాలులో ఆదివారం వామ్ సీనియర్ సిటిజెన్స్ ఫోరం, వామ్ గ్రేటర్ చెన్నై, మహిళా విభాగం వలసరవాక్కం ఆర్యవైశ్య అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో వైశ్యాస్ సీనియర్ సిటిజెన్స్ గాలా మీట్-2024 కోలాహలంగా జరిగింది. ముఖ్యఅతిథిగా తంగుటూరి రామకృష్ణ హాజరై జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీనియర్ సిటిజెన్స్‌లో కళాకారులు, విద్యావంతులు, వైద్యులు తదితర మేధావులున్నారని, వీరందర్నీ సభ్యులుగా చేర్చుకొని వామ్ తరఫున వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అబుదాబిలో సెప్టెంబరు 15న మొట్టమొదటిసారిగా నిర్వహించనున్న వామ్ గ్లోబల్ కన్వెన్షన్‌లో ప్రపంచం నలుమూలల నుంచి కొన్ని వేల మంది రాజకీయ నాయకులు, వ్యాపార ప్రముఖులు, రాజవంశీయులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం గౌరవ అతిథిగా పాల్గొన్న అజంతా డా.కె.శంకరరావు మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులు ఆయా దేశాల అభివృద్ధికి తమవంతు కృషిచేస్తున్నారని, వామ్ కూడా తన సేవలను విశ్వవ్యాప్తం చేస్తోందని ప్రశంసించారు. ఫోరం అధ్యక్షుడు వీఎన్ హరినాథ్ సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా జైరాజ్ గ్రూప్ సంస్థల సీఎండీ, వామ్ గ్లోబల్ అడ్వయిజర్ తాడేపల్లి రాజశేఖర్, టీవీఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ రాజేంద్రన్, జి.రాధాకృష్ణ, వి.దామోదర్, ఎం.జగదీష్ సింహం, ఎ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా క్విజ్, ఆరోగ్య సూత్రాలు, సంగీతం, క్రీడలకు సంబంధించి నిర్వహించిన పోటీల్లో సీనియర్ సిటిజన్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు, ప్రముఖులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.

తిరుచెందూరులో పోటెత్తిన భక్తులు



సముద్రస్నానం చేయడానికి గుమికూడిన భక్తులు



తిరుచెందూరు ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

చెన్నై, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఆణి మాస పౌర్ణమి, వారాంతపు సెలవుల కారణంగా తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం రాత్రి ఆణి పౌర్ణమి సందర్భంగా రాష్ట్రం నలమూలల నుంచి వచ్చిన లక్షలాదిమంది భక్తులు సముద్రతీరంలో సేదతీరారు. రాత్రంతా స్వామివారినికి కీర్తిస్తూ భజనలు చేస్తూ గడిపారు. ఆలయ నిర్వాహకులు పంపిణీ చేసిన ప్రసాదాలు స్వీకరించి సముద్రతీరంలో జాగారం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆలయాన్ని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భక్తులు విచ్చేశారు. శనివారం రాత్రి ఆలయ ప్రాంగణంలోను, సముద్రతీరంలో వేల సంఖ్యలో భక్తులు నిద్రపోయారు. ఆదివారం వేకువజామునే భక్తులు స్వామివారి విశ్వరూపదర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత అర్చకులు స్వామివారికి ఉదయమార్తాండ అభిషేకం, ఆరాధన, పూజలు నిర్వహించారు. వేకువజామునే భక్తులు సముద్రంలో, ఆలయ ప్రాంగణం వద్దనున్న నాయికినరు బావి తీర్థజలాలతో స్నానమాచరించారు.

హొగెనేకల్ వద్ద పెరిగిన పర్యాటకుల సందడి



జలపాతంలో దోనెలపై విహరిస్తున్న పర్యాటకులు

చెన్నై, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా హొగెనేకల్ జలపాత ప్రాంతం ఆదివారం పొరుగు జిల్లాలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులతో సందడిగా మారింది. హొగెనేకల్ జలపాతంలోకి సెకనుకు 700 ఘనపుటడుగుల చొప్పున కావేరి జలాలు ప్రవేశిస్తున్నాయి. అదే సమయంలో ప్రధాన జలపాతం, సినీ జలపాతం, కావేరి తీర ప్రాంతాల్లో పర్యాటకులు స్నానం చేయడానికి పోటీపడ్డారు. ప్రధాన జలపాతం వద్ద నీటి ప్రవాహం సాఫీగా ఉండటంతో పర్యాటకులు దోనెల సవారీ చేశారు. ఈ దోనెల సవారీని గతంలో కాంట్రాక్టర్లు నడిపేవారు. ఇటీవల దోనెల సవారీ కాంట్రాక్టు గడువు పూర్తికావటంతో రాష్ట్ర ప్రభుత్వమే దోనెల సవారీని నిర్వహిస్తోంది. ఆ మేరకు ఆదివారం ఉదయం మామరత్తు కడవు గోనెల సవారీ స్టార్టింగ్ పాయింట్ వద్ద పెద్ద సంఖ్యలో పర్యాటకులు బారులు తీరారు. పర్యాటకులు లైఫ్‌జాకెట్లు ధరించి దోనెలో ప్రయాణించారు. ఆ దోనెలు తొంపచ్చికల్ మీదుగా పెరియపాని, మనల్‌మేడు మీదుగా కావేరి వాగులోని బండరాళ్ల మధ్య ప్రయాణించాయి. పర్యాటకులతో హొగెనేకల్‌లోని కీలక ప్రాంతాలైన ఫుట్‌పాత్, ఫిష్ సేల్ సెంటర్, క్రోకొడైల్ పార్కు, కలర్‌ఫిష్ అక్వేరియం ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఇక హొగెనేకల్‌కు విహారయాత్రగా వచ్చినవారంతా తమ వాహనాలను పోలీసుస్టేషన్, తమిళనాడు హోటల్ పార్కింగ్ ఏరియా, సత్తిరం క్రోకొడైల్ ప్రాంతాల్లో పార్కింగ్ చేశారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా సుమారు వందమంది పోలీసులు తగు భద్రత కల్పించారు.

హృదయ సంరక్షణపై మెరిడియన్ అవగాహన

చెన్నై, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నైలోని మెరిడియన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీసెంట్‌నగర్ ఎలియట్స్ బీచ్ వద్ద ఆదివారం ఉదయం 'లెట్ అస్ బీట్ ది హార్ట్' పేరుతో హృదయ సంరక్షణపై అవగాహన ప్రచారం, శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. ఈ కార్యక్రమాలకు ఆస్పత్రి సీఈఓ డాక్టర్ అశోక్ త్యాగరాజన్ అధ్యక్షత వహించారు. ఆస్పత్రి వైద్యనిపుణులు డాక్టర్ సంజీవ్‌కుమార్, అశ్విని లత, డాక్టర్ జననీ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక వైద్య బృందం సీపీఆర్ శిక్షణ కూడా నిర్వహించింది.



హృదయ సంరక్షణపై శిక్షణ జరుపుతున్న మెరిడియన్ ఆస్పత్రి వైద్యనిపుణులు

వైభవంగా ఆంజనేయస్వామి విడయాత్రి ఉత్సవం

ప్యారీస్, జూన్ 23 : స్థానిక మాధవరం సమీపంలోని పొన్నియమ్మన్‌మేడు మోహన్‌నగర్‌లో ఉన్న వెంకటాద్రి భజన సమాజం ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి విడయాత్రి ఉత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఈ భజన సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో శ్రీనివాస తిరుకల్యాణ మహోత్సవం రంగరంగ వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు, సీతారామలక్ష్మణులు, రామానుజులను తులసీదళాలతో, ఆంజేయస్వామివారిని వడమాలతో అలంకరించారు. వేడుకలలో భాగంగా భక్త బృందం అన్నమయ్య కీర్తనలు ఆలపించారు.కల్యాణోత్సవం విజయవంతమైనందుకు సహకరించిన అందరికీ ఈ సందర్భంగా సమాజం తరఫున కే పద్మరాజ్, కే ఐశ్వర్య కృతజ్ఞతలు తెలిపి, భక్తులందరికీ తీర్థ అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.



శ్రీవారికి హారతి పూజ నిర్వహిస్తున్న అర్చకులు



వడమాల అలంకరణలో కనువిందు చేస్తున్న ఆంజనేయస్వామి

వైభవంగా నరసింహస్వామి రథోత్సవం

ప్యారీస్, జూన్ 23: స్థానిక ట్రిప్లికేన్‌లోని పురాతనమైన పార్థసారధి ఆలయ ప్రాంగణంలో కొలువైన నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. ఏడో రోజైన ఆదివారం ఉదయం నిర్వహించిన రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని రథం లాగారు. నరసింహస్వామి ఆలయంలో ఈ నెల 17న ధ్వజారోహణంతో పది రోజుల బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు వివిధ నరసింహ అవతారాలతో ఉత్సమూర్తులను పురవీధుల్లో ఊరేగిస్తున్నారు. ప్రధాన వేడుకైన రథోత్సవం సందర్భంగా నరసింహ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఆశీనులను చేశారు. ఉదయం 7 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రధాన ప్రవేశద్వారం నుంచి ప్రారంభమైన రథోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. రద్దీలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా 200 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



రథం లాగుతున్న భక్తులు